సాక్షి
డా. బి ఆర్ అంబేడ్కర్ కోనసీమ

గురువారం | 5 | అక్టోబర్ | 2023



హుండీ లెక్కింపు

బోట్‌క్లబ్ (కాకినాడ): స్థానిక సూర్యారావుపేటలోని బాలాత్రిపుర సుందరి సమేత రామలింగేశ్వర స్వామి ఆలయంలో హుండీలను బుధవారం లెక్కించగా రూ.9.37 లక్షలు ఆదాయం వచ్చింది.



వృద్ధురాలి దారుణ హత్య

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరులో తల్లోజు పార్వతి (75) దారుణ హత్యకు గురైంది. తన ఇంట్లో మంగళవారం రాత్రి నిద్రించిన ఆమె బుధవారం ఉదయానికి రక్తపు మడుగులో పడి ఉంది.

8లో

మిగులు జలాల విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 2,22,141 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడిచిపెట్టారు. అలాగే తూర్పు డెల్టాకు 4,400, మధ్య డెల్టాకు 2,300, పశ్చిమ డెల్టాకు 6 వేల క్యూసెక్కుల నీరు విడుదల చేశారు. భద్రాచలం వద్ద 20.20, బ్యారేజీ వద్ద 10.45 అడుగులకు నీటిమట్టం చేరింది.

న్యూస్‌రీల్

అరుణాచలం రామేశ్వరం యాత్రకు ప్రత్యేక బస్

రావులపాలెం: అరుణాచలం గిరి ప్రదక్షిణ, రామేశ్వరం యాత్రలకు ప్రత్యేక బస్ ఏర్పాటు చేసినట్టు రావులపాలెం ఆర్టీసీ డిపో మేనేజర్ కేడీఎంఎస్ కుమార్ బుధవారం తెలిపారు. సూపర్ లగ్జరీ బస్సులో అక్టోబర్ 27 నుంచి నవంబర్ 8వ తేదీ వరకూ ఈ యాత్ర సాగుతుందన్నారు. పుష్ బ్యాక్ రెండు ప్లస్ రెండు సీట్ల సూపర్ లగ్జరీ బస్సుకు రూ.8,500 టికెట్ ధరగా నిర్ణయించామన్నారు. భోజనం, ప్రయాణానికి మాత్రమే ఈ ధర అని, వసతికి కాదని చెప్పారు. యాత్రలో తిరుత్తణి, కాంచీపురం, పళని, పరిముదురచోలై, తిరుప్పారన్ కుండ్రాం, మధురై, కన్యాకుమారి, తిరుచందూర్, రామేశ్వరం, తంజావూర్, స్వామిమలై, కుంభకోణం, తిరువారూర్, తిరుకడయూర్, అరుణాచలం, శ్రీపురం, శ్రీకాళహస్తి మీదుగా యాత్ర సాగుతుందన్నారు. వివరాలకు అసిస్టెంట్ మేనేజర్ కార్యాలయంలోని 73828 11871 నంబర్‌కు సంప్రదించాలన్నారు.

ప్రభుత్వ ఉత్తర్వులపై పెన్షనర్స్ అసోసియేషన్ హర్షం

అమలాపురం టౌన్: సర్వీస్ పెన్షనర్ కంటే ముందు స్పౌస్ (భర్త లేదా భార్య) మరణిస్తే ఫ్యూనరల్ చార్జీల చెల్లింపుపై ఉన్న సందిగ్ధతను తొలగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ఉత్తర్వులపై స్టేట్ గవర్నమెంట్ పెన్షనర్స్ అసోసియేషన్ జిల్లా శాఖ హర్షం వ్యక్తం చేసింది. 2022 పీఆర్సీలో ఫ్యూనరల్ చార్జీలు రూ.25 వేలుగా నిర్దేశించి ఉన్నప్పటికీ సర్వీస్ పెన్షనర్ కంటే ముందు వారి స్పౌస్ మరణిస్తే చెల్లింపులు చాలా జిల్లాల్లో జరగడం లేదు. సవరణ ఉత్తర్వులు జారీ చేయాలని ఏపీ పెన్షనర్స్ అసోసియేషన్ రాష్ట్ర ప్రభుత్వాన్ని కోరామని జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పి.కృష్ణశాస్త్రి, ప్రధాన కార్యదర్శి కేకేవీ నాయుడు గుర్తు చేశారు. అసోసియేషన్ విజ్ఞాపనపై రాష్ట్ర ప్రభుత్వం స్పందించి ఉత్తర్వులు జారీ చేయడం సంతోషమని పేర్కొన్నారు.

విఘ్నేశ్వరుని చవితి ఆదాయం రూ.53,74,264

అయినవిల్లి: విఘ్నేశ్వరస్వామివారికి చవితి మహోత్సవాల్లో భాగంగా రూ.53,74,264 ఆదాయం లభించిందని ఆలయ చైర్మన్ గుత్తుల నాగబాబు, ఈఓ ముదునూరి సత్యనారాయణరాజు తెలిపారు. స్వామివారికి వివిధ పూజా టికెట్ల విక్రయం ద్వారా రూ.31,85,099, సీజనల్ పండ్ల రసాల అభిషేక టిక్కెట్లు ద్వారా రూ.6,30,500, హుండీ ఆదాయం రూ.14,97,849, అన్న ప్రసాదం వద్ద హుండీల ద్వారా రూ.24,714, ఉత్సవ పందిరి హుండీ ద్వారా రూ.36,102 లభించిందన్నారు. గత సంవత్సరంతో పోలిస్తే రూ.5,74,306 ఆదాయం అధికంగా లభించిందని చెప్పారు.

16 నుంచి ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల తనిఖీ



మాట్లాడుతున్న డీఆర్‌ఓ సత్తిబాబు

అమలాపురం రూరల్: ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీ ముమ్మిడివరం ఎయిమ్స్ కళాశాల మూడో అంతస్తులో ఈ నెల 16 నుంచి నవంబర్ 10వ తేదీ వరకు రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో నిర్వహిస్తామని జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు తెలిపారు. కలెక్టరేట్‌లో డీఆర్‌వో చాంబర్‌లో బుధవారం రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశం నిర్వహించి ప్రత్యేక ఓటర్ల జాబితా సంక్షిప్త సవరణ ప్రక్రియ, పురోగతి అంశాలను వివరించారు. ఆయన మాట్లాడుతూ ఈ నెల 27వ తేదీ ముసాయిదా ఓటరు జాబితా ముద్రించి రాజకీయ పార్టీలకు అందిస్తామని చెప్పారు. క్లెయిమ్‌లు, అభ్యంతరాలు ఉంటే డిసెంబర్ 9వ తేదీ వరకు సమర్పించవచ్చునని సూచించారు. రానున్న 2024 జనవరి ఒకటో తేదీ నాటికి 18 సంవత్సరాల వయసు నిండిన యువత దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓట్ల తొలగింపునకు తప్పనిసరిగా నోటీసులు జారీ చేస్తామని స్పష్టం చేశారు. ఒక్కొక్క వ్యక్తి ఐదుకు మించి నమోదు కోసం దరఖాస్తులు పంపరాదని సూచించారు. ఈ సందర్భంగా రాజకీయ పార్టీలకున్న సందేహాలను ఆయన నివృత్తి చేశారు. రాజకీయ పార్టీల ప్రతినిధులు సంసాని చంద్రశేఖర్, యర్లగడ్డ రవీంద్ర, అల్లాడి స్వామినాయుడు, దూరి రాజేష్, కారెం వెంకటేశ్వరరావు, చంద్రరావు పాల్గొన్నారు.

ద్రాక్షారామలో రేపు జాబ్‌మేళా

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామలోని శ్రీనివాస శైల ఐటీఐ ప్రాంగణంలో ప్రముఖ ప్రైవేటు కంపెనీలలో ఉద్యోగాల నిమిత్తం శుక్రవారం జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా ఉపాధి అధికారి వసంతలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. 10వ తరగతి నుంచి డిగ్రీ, ఎంబీఏ ఉత్తీర్ణులైన అభ్యర్థులు తమ సర్టిఫికెట్లతో ఉదయం 10.30 గంటలకు రావాలని కోరారు. వివరాలకు 95332 21189 నంబరులో సంప్రదించవచ్చు.

ప్రమాదాలకు స్పాట్ పెట్టేలా...



216 జాతీయ రహదారిలో రావులపాలెం జూనియర్ కాలేజీ వద్ద బ్లాక్ స్పాట్‌గా గుర్తించిన ప్రాంతం

- భద్రతా వారోత్సవాలలో ప్రత్యేక దృష్టి
- ఆర్అండ్‌బీ రోడ్లలో 53 బ్లాక్ స్పాట్‌ల గుర్తింపు
- జాతీయ రహదారులపై మరో 11 ప్రాంతాలు
- 101 చోట్ల స్పాట్ హోల్స్ గుర్తింపు
- అపాయకరంగా కోటిపల్లి యానాం ఏటిగట్టు రోడ్డు
- నివారణకు సంయుక్త ప్రణాళిక

సాక్షి అమలాపురం: రహదారులపై సరైన భద్రతా ప్రమాణాలు పాటించకపోవడం, వాహన చోదకుల నిర్లక్ష్యం ప్రాణాలను హరించేస్తున్నాయి. రోడ్డు ప్రమాదాలలో అధికంగా యువత మృత్యువాత పడడం ప్రజలను కలచివేస్తోంది. దీనిని గుర్తించిన జిల్లా యంత్రాంగం రోడ్డు ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించింది. జిల్లాస్థాయి రోడ్డు భద్రతా కమిటీ జిల్లాలో ప్రమాదాలను తగ్గించే చర్యలకు ఉపక్రమించింది.

అధికారుల చర్యలు

జిల్లాలో 2022లో 610 ప్రమాదాలు జరగగా, 156 మంది మృత్యువాత పడ్డారు. ఈ ఏడాది సెప్టెంబర్ 30వ తేదీ వరకు 497 ప్రమాదాలు చోటుచేసుకోగా 154 మంది మరణించారు. గత ఏడాదితో పోల్చుకుంటే ఈ ఏడాది మృతుల సంఖ్య అధికంగా ఉంది. ప్రమాదాలలో మృతుల సంఖ్య గత ఏడాది 25 శాతం ఉండగా, ఈ ఏడాది 30.09 శాతం ఉండడం ఆందోళనకు గురి చేస్తోంది. ప్రమాదాలలో యువత అధికంగా మృత్యువాత పడుతున్నారు. దీనిని గుర్తించిన జిల్లా యంత్రాంగం ప్రమాదాల నివారణ చర్యలకు ఉపక్రమించింది. దీనిలో భాగంగా అధికంగా ప్రమాదాలు జరిగే ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా గుర్తించింది. 500 మీటర్ల పరిధిలో మూడు కన్నా అధిక ప్రమాదాలు జరుగుతున్న ప్రాంతాలు వీటి పరిధిలోకి రాగా, ప్రమాదాలకు కారణమవుతున్న గుంతలు (గుంటల)ను స్పాట్ హోల్స్‌గా గుర్తించారు.

ఆ ఏడు ప్రాంతాల్లో అధికం

ఆర్అండ్‌బీ, ఎన్‌హెచ్, రవాణా, పోలీసుశాఖ సంయుక్తంగా నిర్వహించిన సర్వేలో ప్రమాదకర ప్రాంతాలను గుర్తించారు. ఆర్అండ్‌బీ రోడ్ల పరిధిలో 53 బ్లాక్ స్పాట్‌లు ఉన్నాయి. 216, 216ఏ జాతీయ రహదారుల పరిధిలో 18 ప్రాంతాలను బ్లాక్ స్పాట్‌లుగా తేల్చారు. ఇలా జిల్లా మొత్తం 71 బ్లాక్ స్పాట్‌లు ఉన్నాయి. 216ఏ పరిధిలో రావులపాలెంలో జూనియర్ కాలేజీ, ఈతకోట వద్ద, హైవే జంక్షన్ల వద్ద తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయి. ఇదే మండల పరిధిలో హైవే మీద ఎల్.పోలవరం, రావులపాడు, ఆలమూరు మండలం మూలస్థానం, చొప్పెళ్ల లాకులు, జొన్నాడ జంక్షన్ వద్ద ప్రమాదాలు అధికం. ఇక కత్తిపూడి– నర్సాపురం 216 జాతీయ రహదారిపై జిల్లాలో ఐ.పోలవరం నుంచి మలికిపురం మండలం దిండి వరకు పలు ప్రమాదాలు జరుగుతున్నాయి. అధికంగా మహిపాల చెరువు జంక్షన్, పేరూరు ఎత్తురోడ్డు, ఎస్‌కేబీఆర్ కాలేజీ, పేరూరు జంక్షన్ వంటి వాటి చోట అధిక ప్రమాదాలు చోటు చేసుకుంటున్నాయని అధికారులు గుర్తించారు.

కోటిపల్లి– యానాం రోడ్డు పరిధిలో జొన్నాడ నుంచి యానాం వరకు సుమారు 48 కిలోమీటర్ల నిడివి ఉన్న రోడ్డు సైతం ప్రమాదాలకు నిలయంగా మారింది. దీనిని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేసిన జిల్లా రోడ్డు భద్రతా కమిటీ ప్రత్యేకంగా సర్వే చేపట్టింది. ఏడు ప్రాంతాలను ప్రమాదాలు అధికంగా జరిగే వాటిగా నిర్ధారించింది. రోడ్డు పొడవునా తుప్పలు, మలుపుల వద్ద రైలింగ్, జంక్షన్ల వద్ద స్పీడ్ బ్రేకర్లు, పలుచోట్ల రోడ్డును ఆనుకుని బెర్ములు లేకపోవడంతో ప్రమాదాలు జరుగుతున్నాయని గుర్తించారు.



అమలాపురం ఎస్‌కేబీఆర్ కాలేజీ వద్ద ఏర్పాటు చేసిన హెచ్చరిక బోర్డు

ప్రమాదాల నివారణపై ప్రత్యేక దృష్టి



జిల్లాలో ప్రమాదాల నివారణపై ప్రత్యేకంగా దృష్టి సారించాం. ఇప్పటికే బ్లాక్ స్పాట్‌ల వద్ద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశాం. కోటిపల్లి–యానాం రోడ్డు మీద కూడా భద్రతా చర్యలు తీసుకోనున్నాం. వచ్చే సమావేశం నాటికి రోడ్డు భద్రతపై ఒక ప్రణాళిక సిద్ధం చేస్తాం.

– అశోక్ ప్రతాప్, జిల్లా రవాణా శాఖ అధికారి

ప్రమాదాల నివారణకు ప్రతిపాదనలు

- బ్లాక్ స్పాట్‌ల వద్ద బోర్డులు ఏర్పాటు చేయడంతోపాటు ఇతర రక్షణ సౌకర్యాలు కల్పించాలని జిల్లా కమిటీ సూచించింది. దీంతోపాటు మరికొన్ని ప్రతిపాదనలు చేసింది. ఇంకా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అన్ని శాఖలు కలిసి సంయుక్తంగా ఒక కార్యాచరణ ప్రణాళికను సిద్ధం చేయనున్నాయి. వచ్చే సమావేశంలో దీనికి తుది రూపు రానుంది.
- జొన్నాడ– రావులపాలెం వంతెనపై విద్యుత్ దీపాల సౌకర్యం కల్పించడంతోపాటు యానాం– కోటిపల్లి రోడ్డులో ప్రమాదాలు జరిగేచోట రోడ్డుకు ఇరువైపులా రైలింగ్, మలుపుల వద్ద బోర్డులు, ప్రత్యేక భద్రతా చర్యలు చేపట్టాలని నిర్ణయించారు. హైవేలపై అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ సిస్టం వాహనాలు అందుబాటులోకి తీసుకురావాలి.
- ప్రమాదాలు జరిగిన సందర్భంలో దగ్గరలోని ఆసుపత్రుల వివరాలు, ఫోన్ నంబర్లు తెలిసేలా ఎక్కువగా బోర్డులు ఏర్పాటు చేయాలి. ఆలమూరు, కొత్తపేటలలో ట్రామా కేర్ కేంద్రాల ఏర్పాటు.
- యువత ప్రమాదాల బారిన పడకుండా పాఠశాలలు, కళాశాలలో రోడ్ సేఫ్టీ క్లబ్బులు ఏర్పాటు చేయడం. వీటికి ప్రధానోపాధ్యాయులు, సాంఘిక శాస్త్రం టీచర్ల సమన్వయంతో 20 మంది సభ్యులుగా క్లబ్‌లు ఏర్పాటు చేయడం. రహదారి భద్రతా నియమాలపై అవగాహన కల్పించడం.
- సెల్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయడం వల్ల అధిక ప్రమాదాలు జరుగుతున్నందున దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టడం. ద్విచక్ర వాహన చోదకులు హెల్మెట్ ధరించడం, కారులో ప్రయాణికులు సీటు బెల్టు పెట్టుకోవడంపై అవగాహన కల్పించడం.

‘సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం’

- నేడు అమలాపురంలో సదస్సు
- ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని రాక



అమలాపురం టౌన్: అవర్ స్టేట్, అవర్ లీడర్ వైఎస్సార్ ఇంటలెక్చువల్ ఫోరం ఆధ్వర్యంలో ‘సుపరిపాలన దిశగా ఆంధ్రప్రదేశ్ రూపాంతరం’ అనే అంశంపై రాష్ట్ర వ్యాప్తంగా జరుగుతున్న సదస్సుల్లో భాగంగా అమలాపురం సెంట్రల్ కో ఆపరేటివ్ బ్యాంక్ హాలులో గురువారం ఉదయం 10.30 గంటలకు సదస్సు జరగనుంది. రాష్ట్ర రవాణా శాఖ మంత్రి పినిపే విశ్వరూప్ ముఖ్య అతిథిగా పాల్గొంటున్న ఈ సదస్సుకు ప్రత్యేక అతిథులుగా ఏపీ మీడియా అకాడమీ చైర్మన్ కొమ్మినేని శ్రీనివాసరావు, ఏపీ అగ్రి మిషన్ వైస్ చైర్మన్ ఎంవీఎస్ నాగిరెడ్డి, అమలాపురం ఎంపీ చింతా అనురాధ, ఎమ్మెల్సీలు, ఎమ్మెల్యేలు హాజరుకానున్నారు. ఈ సదస్సుకు నిర్వాహక చైర్మన్‌గా రాష్ట్ర వైఎస్సార్ సీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి కె.త్రినాథరెడ్డి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం సుపరిపాలనపరంగా అమలు చేస్తున్న, కృషి చేస్తున్న ఏడు అంశాలపై ఏడుగురు మేధావులు ఆయా అంశాలపై ఉపన్యసిస్తారని కార్యక్రమ నిర్వాహకుడు త్రినాథరెడ్డి తెలిపారు. మీడియా పాత్రపై గుంటూరుకు చెందిన సి.సుందరం శర్మ, ఉన్నత విద్యపై తెనాలికి చెందిన విద్యావేత్త డాక్టర్ కె.రవికుమార్, ఆర్ట్ అండ్ కల్చర్‌పై రాష్ట్ర దృశ్య కళల అకాడమీ చైర్‌పర్సన్ కుడుపూడి సత్య శైలజ, పోలవరంపై రాష్ట్ర వైఎస్సార్ సీపీ రైతు విభాగం ప్రధాన కార్యదర్శి కె.త్రినాథరెడ్డి, ఉద్యానంపై హార్టికల్చర్ యూనివర్శిటీ మెంబర్ జిన్నూరి వెంకటేశ్వరరావు, అమ్మ ఒడి పథకంపై కళ్యాణి, నవరత్నాల పథకాలపై హితకారిణి సమాజం చైర్‌పర్సన్ కాశి మునికుమారి విశ్లేషిస్తారు.

ఆరోగ్యకర సమాజమే ప్రభుత్వ లక్ష్యం

మంత్రి వేణు



జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ప్రారంభించి మాట్లాడుతున్న మంత్రి వేణు

రామచంద్రపురం: ఆరోగ్యకరమైన సమాజాన్ని నిర్మించడమే లక్ష్యంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష పథకానికి శ్రీకారం చుట్టారని రాష్ట్ర బీసీ సంక్షేమం, సమాచార పౌర సంబంధాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి చెల్లుబోయిన శ్రీనివాస వేణుగోపాలకృష్ణ అన్నారు. స్థానిక ముచ్చుమిల్లిలోగల అర్బన్ పీహెచ్‌సీ వద్ద ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని మంత్రి వేణు ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ 30 రోజుల పాటు జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను నిర్వహిస్తున్నామన్నారు. అవసరమైన వారిని ప్రత్యేక ఆసుపత్రులకు పంపి, వారు కోలుకునే వరకు అండగా నిలబడేలా మన ఏఎన్‌ఎంలు, వలంటీర్లు ఉంటారని మంత్రి పేర్కొన్నారు. ప్రతి రోగి ఆరోగ్యం చాలా ముఖ్యమైనదని, వారికి పూర్తి చికిత్స అందించి, కోలుకోవడానికి ప్రభుత్వం బాధ్యత తీసుకుంటుందన్నారు. రాష్ట్రంలోని ప్రతీ పౌరునికి ఆరోగ్యాన్ని అందించాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమం చేపట్టామన్నారు. ఆరోగ్యకరమైన సమాజాన్ని, ఆర్థిక వ్యవస్థను ప్రభుత్వం తయారు చేస్తుందని, తద్వారా ఆరోగ్యకరమైన రాష్ట్రం నిర్మాణమవుతుందని మంత్రి అన్నారు. మున్సిపల్ చైర్ పర్సన్ గాధంశెట్టి శ్రీదేవి, కౌన్సిలర్లు, వైఎస్సార్ సీపీ నేతలు, వైద్యులు, ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఆరోగ్యమే మహాభాగ్యం

జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరం తనిఖీ చేసిన కలెక్టర్



జి.వేమవరం వైద్య శిబిరంలో మందులు పరిశీలిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

ఐ.పోలవరం: ఆరోగ్యమే మహాభాగ్యమని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో ప్రజల ఆరోగ్య పరిస్థితులు చక్కదిద్దటమే లక్ష్యంగా ‘జగనన్న ఆరోగ్య సురక్ష’ కార్యక్రమాలు సమర్థంగా నిర్వహిస్తున్నామని కలెక్టర్ హిమాన్షు శుక్లా అన్నారు. బుధవారం ఐ.పోలవరం మండలం జి.వేమవరం జెడ్పీ పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహణ తీరును ఆయన తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ ప్రతీ ఒక్కరూ జగనన్న ఆరోగ్య సురక్ష సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ప్రజారోగ్యమే లక్ష్యంగా ఫ్యామిలీ డాక్టర్ కాన్సెప్ట్‌తో పాటు జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నెలరోజుల పాటు ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. ఈ శిబిరంలో వైద్య పరీక్షలతో పాటు ఉచితంగా మందులు పంపిణీ చేస్తామన్నారు. వైద్యులు ఇందిరాశ్రీ, టి.ఆదిత్య పవన్, రమ్య, టి.పవన్ సేవలు అందించారు. 501 మంది వివిధ రకాల పరీక్షలు చేయించుకొన్నారు. ల్యాబ్ టెస్టులు 94, కంటి పరీక్షలు 86 మందికి నిర్వహించారు. సర్పంచ్ నల్లా సుదర్శన్, ఎంపీపీ మోర్త రాణి మిరియంజ్యోతి, మండల పార్టీ కన్వీనర్ పిన్నంరాజు వెంకటపతిరాజు, మెండా వెంకన్నబాబు, ఎంపీడీఓ డి.రాంబాబు పాల్గొన్నారు.

సంక్షేమానికి తోడ్పాటు

సైనిక్ వెల్ఫేర్ బోర్డు సమావేశంలో కలెక్టర్ హిమాన్షు శుక్లా



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా

అమలాపురం రూరల్: అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో మాజీ సైనిక ఉద్యోగుల సంక్షేమానికి తోడ్పాటును అందించడం కోసం వారి ఇంటి పన్ను రద్దు చేసే ప్రయత్నం చేస్తామని కలెక్టర్ హిమాన్షు శుక్లా తెలిపారు. మాజీ సైనికులకు, వారిపై ఆధారపడిన కుటుంబ సభ్యులకు ప్రాధాన్యం ఇస్తామని అన్నారు. బుధవారం కలెక్టరేట్‌లో తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా సైనిక్ వెల్ఫేర్ బోర్డు సమావేశంలో కలెక్టర్ పలు అంశాలపై కమిటీ సభ్యులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మున్సిపల్ షాపింగ్ కాంప్లెక్స్‌ల్లో షాపుల కేటాయింపునకు చర్యలు చేపడతామని అన్నారు. కమిటీ సూచనలకు అనుగుణంగా ఔట్‌సోర్సింగ్ జాబ్‌మేళాలో ప్రాధాన్యం ఇచ్చేందుకు చర్యలు తీసుకుంటామన్నారు. మాజీ సైనికుల సంక్షేమ కేంద్రాల ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. జిల్లా సైనిక్ వెల్ఫేర్ కార్యాలయం కోసం స్థలాన్ని కేటాయిస్తామని చెప్పారు. జిల్లా గ్రామీణ అభివృద్ధి సంస్థ స్వయం సహాయక సంఘాలలో సభ్యులు ఒక్కొక్కరి ద్వారా ఏడాదికి రూ.పది చొప్పున, జిల్లా నీటి యాజమాన్య సంస్థలో పనిచేసే వేతన కూలీల ద్వారా ఏడాదికి రూ.పది చొప్పున సేకరించి ప్రత్యేక నిధిని కేటాయించడానికి చర్యలు చేపడతామన్నారు. వికాస ద్వారా ఔట్ సోర్సింగ్ జాబ్ మేళాలో మాజీ సైనికుల కుటుంబాలకు ప్రాధాన్యం ఇస్తామన్నారు. జిల్లా కేంద్రంలో క్యాంటీన్ ఏర్పాటుకు ప్రయత్నిస్తామని తెలి పారు. మాజీ సైనికుల కుటుంబాలలోని వారికి ఉద్యోగ అవకాశాల కల్పనకు చర్యలు చేపడతామన్నారు. జిల్లా సైనిక అధికారి కెప్టెన్ డాక్టర్ పి.సత్యప్రసాద్, వైస్ చైర్మన్ కల్నల్ రఘు వర్మ, సభ్యులు సుబేదార్ నారాయణ, పిండి నరసయ్య నాయుడు, పి.రాజబాబు నాయక్, డిజైన్ మూర్తి, సార్జెంట్ జి.భానుప్రకాష్, జిల్లా రెవెన్యూ అధికారి సీహెచ్ సత్తిబాబు, డీఆర్‌డీఏ పీడీ శివశంకర్ ప్రసాద్, డ్వామా పీడీ ఎస్.మధుసూదన్ వికాస పీడీ కె.లచ్చారావు, వికాస జిల్లా మేనేజర్ జి.రమేష్, మెప్మా పీడీ ప్రియంవద, జిల్లా ఉపాధి కల్పనాధికారి వి.వసంత లక్ష్మి పాల్గొన్నారు.

మత్స్యకార సంక్షేమానికి కృషి

మంత్రి విశ్వరూప్



సభలో పాల్గొన్న మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ ఇజ్రాయిల్, ఎమ్మెల్యేలు పొన్నాడ, రాపాక తదితరులు

అమలాపురం రూరల్: మత్స్యకార సంక్షేమానికి ప్రభుత్వం కృషి చేస్తుందని రాష్ట్ర రవాణాశాఖ మంత్రి విశ్వరూప్ అన్నారు. ఈదరపల్లి గ్రామంలో కోనసీమ సెంట్రల్ డెల్టా ఫిష్ వర్తక సంక్షేమ సంఘం నూతన భవనాన్ని మంత్రి విశ్వరూప్, ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్, ముమ్మిడివరం, రాజోలు ఎమ్మెల్యేలు పొన్నాడ సతీష్ కుమార్, రాపాక వరప్రసాదరావులతో కలిసి బుధవారం ప్రారంభించారు. మంత్రి మాట్లాడుతూ సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం మత్స్యకారుల అభివృద్ధి కోసం సంక్షేమ పథకాలు, రుణాలు అందిస్తోందన్నారు. కోనసీమ సెంట్రల్ డెల్టా ఫిష్ వర్తక సంక్షేమ సంఘం నూతన భవనం అందుబాటులోకి రావడం హర్షణీయమని అన్నారు. ఏఎంసీ చైర్‌పర్సన్ దంగేటి డోలమణి, ఎంపీపీ కుడిపూడి భాగ్యలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యుడు పందిరి శ్రీహరిరామ్‌గోపాల్, సర్పంచ్ రాయుడు వరలక్ష్మి ,రూరల్, పట్టణ వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు బొంతు గోవింద శెట్టి, సంసాని నాని, మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాస్, సెంట్రల్ డెల్టా బోర్డు చైర్మన్ కుడిపూడి వెంకటేశ్వరబాబు, వైస్ ఎంపీపీ అడపా సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ఆర్థిక పురోగతికి చర్యలు

జాతీయ లైవ్ స్టాక్ మిషన్ సదస్సులో జేసీ నుపూర్ అజయ్



పశు అభివృద్ధి పథకం కరపత్రాలు ఆవిష్కరిస్తున్న జేసీ నుపూర్ అజయ్ తదితరులు

అమలాపురం రూరల్: గ్రామీణ నిరుద్యోగ యువతకు ఉపాధిని, ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు సుస్థిరతను కల్పించి ఆత్మ నిర్భరతను సాధించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు జాతీయ పశు అభివృద్ధి పథకం (లైవ్ స్టాక్ మిషన్) ప్రవేశ పెట్టాయని జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్ పేర్కొన్నారు. బుధవారం జిల్లా పశుసంవర్థక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్ గోదావరి భవన్ హాలులో జాతీయ లైవ్ స్టాక్ మిషన్ కార్యక్రమాలపై జిల్లా స్థాయి అవగాహన సదస్సును జేసీ అధ్యక్షతన నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ ఔత్సాహిక రైతులను, నిరుద్యోగులను పశుపోషణకు ప్రోత్సహిస్తూ ఆర్థిక పురోగతి సాధించే విధంగా చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ పశుసంవర్థక అధికారులను, బ్యాంకర్లను కోరారు. ఐదు సంవత్సరాల కాల పరిమితితో ఔత్సాహిక రైతులను వ్యాపార సరళిలో ప్రోత్సహించేందుకు ఈ పథకాన్ని ప్రవేశ పెట్టారన్నారు. ఈ పథకంలో గొర్రెలు, మేకలు, కోళ్ల, పందుల పెంపకానికి కేంద్రం ప్రభుత్వం 50 శాతం రాయితీ ఇస్తుందని అన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి అధ్యక్షుడు మోటూరు సాయి, పశుగణాభివృద్ధి అధ్యక్షుడు యాళ్ల దొరబాబు, పశుసంవర్థక శాఖ సంయుక్త సంచాలకుడు కె.వెంకటరావు, జిల్లా వ్యవసాయ అధికారి ఎ.బోసుబాబు మాట్లాడారు. పశుగణాభివృద్ధి శాస్త్రవేత్త దినకర్ పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పథకం అమలు తీరును వివరించి, సందేహాలను నివృత్తి చేశారు. శాస్త్రవేత్త వరప్రసాద్ జాతీయ పశుగణాభివృద్ధి పథకంపై రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పశు అభివృద్ధి పథకం కరపత్రాలను ఆవిష్కరించారు. లీడ్ బ్యాంకు మేనేజర్ శ్యాంబాబు, ఉపసంచాలకుడు కర్నీడి మూర్తి, సహాయ సంచాలకుడు ఎల్.విజయరెడ్డి, రైతు సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఉరి వేసుకుని వృద్ధుడి మృతి

డబ్బే అన్నింటికి మూలమని.. సూసైడ్ నోట్

కాకినాడ రూరల్: చిన్న చిన్న పనులు చేసుకుంటూ అపార్టుమెంట్‌లో ఒంటరిగా ఉండే ఆ వృద్ధుడు బలవన్మరణం పొందాడు. ఐదేళ్లుగా అద్దెను సక్రమంగా చెల్లించడంతో పెద్దగా పట్టించుకోని అపార్టుమెంట్ యజమాని, ఏడాదిగా సరిగా అద్దె చెల్లించకపోయినా ఇబ్బంది పెట్టలేదు. నా అన్న వాళ్ల లేక, పని లేక పూట గడవడమే కష్టంగా భావించిన ఆ వృద్ధుడు ఇక చావే గత్యంతరంగా భావించాడో ఏమో ఉరి వేసుకుని చనిపోయాడు. ఇది జరిగి నాలుగు రోజులు జరిగిన తరువాత అపార్టుమెంట్ నుంచి వచ్చిన దుర్గంధం ఆధారంగా విషయం బుధవారం బయట పడింది. పోలీసులు వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడ విద్యుత్‌నగర్‌లో వంశీకృష్ణా అపార్టుమెంట్‌లో నివాసం ఉంటున్న బోడపాటి వెంకటేశ్వరరావు(61) బెడ్‌రూమ్‌లో లుంగీపంచెతో ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గత నెల 30న వాచ్‌మన్‌తో అమలాపురం వెళుతున్నట్టు తెలిపి కనిపించలేదు. బుధవారం దుర్గంధం ఎక్కువగా రావడంతో తలుపులు బద్దలు కొట్టి చూడగా, బెడ్ రూమ్‌లో పూర్తిగా పాడైన స్థితిలో వెంకటేశ్వరరావు మృతదేహం ఉన్నట్టు గుర్తించారు. అపార్టుమెంట్ యజమాని శర్మ ఫిర్యాదు మేరకు మృతదేహాన్ని పోలీసులు జీజీహెచ్‌కు తరలించారు. సర్పవరం ఎస్సై అజయ్ బాబు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నారు. మృతదేహం వద్ద లభించిన సూసైడ్ నోట్‌లో 'డబ్బే అన్నింటికి మూలమని' రాసి ఉందని చెప్పారు.

భువనేశ్వరికి పలువురి సంఘీభావం

సాక్షి, రాజమహేంద్రవరం: టీడీపీ అధినేత చంద్రబాబు సతీమణి భువనేశ్వరికి పలువురు నేతలు, వివిధ వర్గాల వారు కలిసి సంఘీభావం తెలిపారు. రాజమహేంద్రవరం విద్యానగర్‌లోని లోకేష్ క్యాంప్ కార్యాలయంలో మాజీ ఎంపీ హర్షకుమార్, ఎమ్మెల్యే గంటా, మాజీ ఎమ్మెల్సీ దువ్వారపు రామారావు, గద్దె అనురాధ, మాజీ ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్, బుద్దా నాగజగదీశ్వరరావు సంఘీభావం తెలిపారు. బాబు అరెస్టుకు వ్యతిరేకంగా నిరసన కార్యక్రమాలు కొనసాగుతున్నాయి. ఎమ్మెల్యే బుచ్చయ్య చౌదరి గౌతమీ ఘాట్ వద్ద జలదీక్ష చేపట్టారు. బాబు జ్యుడీషియల్ రిమాండ్ 25వ రోజుకు చేరింది. ఎప్పటిలాగే బాబు జైలు జీవితం సాగింది. చంద్రబాబు తనయుడు లోకేష్ గురువారం రాత్రి రాజమహేంద్రవరం రానున్నారు. శుక్రవారం బాబుతో సెంట్రల్ జైల్లో ములాఖత్ కానున్నట్లు తెలిసింది. లోకేష్ గత నెల 14వ తేదీన ఢిల్లీ వెళ్లినప్పటి నుంచి అక్కడే ఉన్నారు. పవన్, లోకేష్ ములాఖత్ అనంతరం న్యాయపరంగా చర్చించేందుకు వెళ్లి 22 రోజుల అనంతరం రాజమహేంద్రవరం వస్తున్నారు.

సత్తెన్న ఆలయ అభివృద్ధికి మాస్టర్ ప్లాన్

- భక్తుల అవసరాలకు తగ్గట్టుగా రూపకల్పన
- నెలాఖరులోగా కమిషనర్‌కు ప్రతిపాదనలు

అన్నవరం: రత్నగిరిపై కొలువైన శ్రీ వీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో వివిధ నిర్మాణ పథకాలకు సంబంధించి గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో కొన్ని మార్పులు చేసి కొత్తది రూపొందించేందుకు ప్రతిపాదనలు సిద్ధమవుతున్నాయి. దేవస్థానానికి వచ్చే భక్తులు పెరుగుతున్న నేపథ్యంలో రోడ్లు, పార్కింగ్ ప్రదేశాల అభివృద్ధి, వసతి సత్రాల నిర్మాణం తదితర మార్పులు చేపట్టాల్సి ఉంది. దేవస్థానం మాస్టర్ ప్లాన్ 2010లో రూపొందించారు. ఆ తరువాత పలు మార్పులు చేశారు. రాబోయే రోజుల్లో మరికొన్ని నిర్మాణాలు చేపట్టనున్నారు. వీటన్నింటిని దేవస్థానం మాస్టర్ ప్లాన్‌లో చేర్చనున్నారు.

ప్రస్తుతం ఏమి ఉన్నాయంటే...

ప్రస్తుత మాస్టర్ ప్లాన్‌లో కొత్తగా సత్రాల నిర్మాణాలు చేపట్టాలని పేర్కొన్నారు. నిర్మాణాలన్నీ సత్యగిరిపై చేపట్టాలని, మరిన్ని టాయిలెట్‌లు నిర్మించాలని, భక్తుల వాహనాల రాకపోకలకు వీలుగా ఘాట్‌రోడ్లు వెడల్పు చేయాలని, కొత్తగా క్యూ లు నిర్మించాలని అనుకున్నారు.

కొత్తగా మాస్టర్ ప్లాన్‌లో చేర్చుతున్న అంశాలు

- దేవాలయానికి నాలుగు మాడావీధుల నిర్మాణం
- భక్తులు ఏటా 40 శాతం చొప్పున పెరగడం, వ్యక్తిగత వాహనాలపై వచ్చే భక్తులు ఎక్కువ కావడంతో మల్టీ లెవెల్ పార్కింగ్ ఏర్పాటు
- వాహనాలు కొండ దిగువకు వెళ్లేందుకు ఎక్కువ రోడ్ల నిర్మాణం
- అన్నదాన శాల నుంచి, వివిధ సత్రాల నుంచి వచ్చే వ్యర్థాలు, టాయిలెట్స్ నుంచి వచ్చే వేస్ట్‌కూ సూయెజ్ ట్రీట్మెంట్, సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ ప్లాంట్‌ల నిర్మాణం
- దేవస్థానంలో వివిధ చోట్ల, ఘాట్‌రోడ్లలో విద్యుత్ దీపాలు, అండర్ గ్రౌండ్ విద్యుత్ లైన్ల ఏర్పాటు
- మారేడు, తులసి వనాలు, మామిడి, అరటి తదితర చెట్లు విరివిగా పెంచే చర్యలు
- వివిధ పుష్పాలతో కూడిన తోటల పెంపకం
- వసతి గదులు దొరకని భక్తులు సేద తీరేందుకు విశ్రాంతి షెడ్ల నిర్మాణం
- కొండ దిగువన భక్తుల కోసం మరిన్ని నిర్మాణాలు



కొండదిగువన టోల్‌గేట్ పక్కన నిర్మిస్తున్న భక్తుల షెడ్లు



అన్నవరం దేవస్థానం మాస్టర్ ప్లాన్

భక్తుల అవసరాల మేరకు మార్పులు



గతంలో రూపొందించిన మాస్టర్ ప్లాన్‌లో కొత్తగా చేర్చాల్సిన నిర్మాణాలు, ఇతర అభివృద్ధి పనుల గురించి ప్రతిపాదనలు ఈ నెలాఖరులోగా పంపించాలని దేవదాయశాఖ కమిషనర్ ఎస్.సత్యనారాయణ ఆదేశించారు. త్వరలో దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, భక్తులతో సమావేశమై వారి అభిప్రాయాలు తీసుకుని కమిషనర్‌కు నివేదిక పంపుతాం. దేవదాయ మంత్రి కొట్టు సత్యనారాయణ ఆదేశాల మేరకు ఇప్పటికే చేపట్టిన పలు నిర్మాణాలు మాస్టర్ ప్లాన్‌లో చేర్చుతాం.

– చంద్రశేఖర్ అజాద్, ఈఓ, అన్నవరం దేవస్థానం

రోడ్డు ప్రమాదంలో గోపాలమిత్ర మృతి



శివశంకర్ (ఫైల్)

అంబాజీపేట: మాచవరం 3 సచివాలయంలో గోపాలమిత్రగా విధులు నిర్వహిస్తున్న వాకలగరువుకు చెందిన నవుండ్రు శివశంకర్ (40) మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో మృతి చెందారు. అంబాజీపేట పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. శివశంకర్ మంగళవారం రాత్రి విధులు నిర్వహించుకుని బైక్‌పై ఇంటికి వెళుతున్న సమయంలో స్థానిక స్త్రీల ఆస్పత్రి సమీపంలో ఉన్న దొమ్మేటి వారిపాలెం వద్ద కొబ్బరి చెట్టును ఢీ కొట్టారు. గాయపడిన ఆయనను 108లో అమలాపురం ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గ మధ్యలో చనిపోయారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, తల్లి ఉన్నారు. మృతుడి పెద్దమ్మ కుమారుడు ఉందుర్తి పల్లపురాజు ఇచ్చిన ఫిర్యాదుతో కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై ఎ.చైతన్యకుమార్ తెలిపారు. శివశంకర్ కుటుంబ సభ్యులను వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు వాసంశెట్టి చినబాబు, సర్పంచ్ మద్దింశెట్టి దొరబాబు, ఎంపీటీసీ సభ్యుడు వాకపల్లి దొరబాబు, సొసైటీ అధ్యక్షుడు దొమ్మేటి సత్యమోహన్ పరామర్శించారు.

ముగిసిన రాష్ట్రస్థాయి ఖోఖో శిక్షణ శిబిరం



ఏపీ జట్టుతో ఆర్‌జేడీ రాజు తదితరులు

నాగమల్లితోట జంక్షన్ (కాకినాడ సిటీ): రాష్ట్ర స్థాయి ఖోఖో శిక్షణ శిబిరంలో నేర్చుకున్న మెళుకువలతో జాతీయస్థాయి ఖేలో ఇండియా పోటీలలో రాణించి జిల్లాకు, రాష్ట్రానికి మంచి పేరు తేవాలని కాకినాడ డివిజన్ ఉప విద్యాశాఖ అధికారి ఆర్‌జేడీ రాజు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ఖోఖో సంఘం సహకారంతో జిల్లా ఖోఖో సంఘం ఆధ్వర్యంలో కాకినాడ జేఎన్టీయూకే క్రీడాప్రాంగణంలో వారం రోజులుగా జరుగుతున్న రాష్ట్ర స్థాయి ఖోఖో శిక్షణ శిబిరం బుధవారం సాయంత్రంతో ముగిసింది. ఈ ముగింపునకు కాకినాడ డివిజన్ డీవైఈఓ రాజు ముఖ్య అతిథిగా విచ్చేశారు. కార్యక్రమానికి ఖోఖో సంఘ కార్యదర్శి పట్టాభి అధ్యక్షత వహించారు. శిక్షణ శిబిరంలో పాల్గొన్న క్రీడాకారిణులు కోచ్‌లు శ్రీనివాస్, సీహెచ్ లోవలక్ష్మి మెళుకువలు నేర్పించారు. అండర్-14,18 విభాగాల్లో క్రీడాకారిణులు ఈ శిబిరంలో పాల్గొన్నారు. బెంగళూరులో ఈ నెల 6 నుంచి 8 వరకు జరిగే జాతీయస్థాయి ఖేలో ఇండియా ఖోఖో పోటీలలో వీరు పాల్గొంటారు. శిబిరంలో పాల్గొన్న క్రీడాకారిణులకు క్రీడాదుస్తులు జేఎన్టీయూకే పీడీ శ్యాంకుమార్ స్పాన్సర్ చేశారు. వీటిని ఆర్‌జేడీ రాజు అందజేశారు.

ఆలితో తగవెందుకు అన్నందుకు హత్య

- బంధువుల సాయంతో ఇంట్లోకి చొరబడి కర్రలు, గునపాలతో దాడి
- తీవ్ర గాయాలతో అక్కడికక్కడే మృతిచెందిన వైనం



అబ్బులు (ఫైల్)

గండేపల్లి: నీ భార్యను ఎందుకు తిడుతున్నావు అని ప్రశ్నించిన వ్యక్తితో ఘర్షణ పడి, తన బంధువుల సాయంతో అతనిని హత్య చేసిన ఘటన పి.నాయకంపల్లి చోటు చేసుకుంది. స్థానిక పోలీసులు, గ్రామస్తులు తెలిపిన వివరాల మేరకు గండేపల్లి మండలంలోని పి.నాయకంపల్లికి చెందిన గంధం అబ్బులు (62) గ్రామ పంచాయతీ స్వీపర్‌గా పనిచేస్తున్నాడు. అతని ఇంటి ఎదురుగా ఉంటున్న గంధం విజయకుమార్ మంగళవారం సాయంత్రం తన భార్య శాంతమ్మతో గొడవ పడి తిడుతుండగా అబ్బులు జోక్యం చేసుకుని ఎందుకు అలా తిడుతున్నావని అడిగాడు. 'నీ కేంటి సంబంధం. నా భార్యను నేను తిట్టుకుంటాన'ని విజయకుమార్ అనడంతో ఇద్దరి మధ్య మాటామాటా పెరిగి కొట్లాటకు దారితీసింది. ఈ వాగ్వివాదంలో విజయకుమార్ కర్రతో అబ్బులుపై దాడి చేశాడు. అనంతరం అబ్బులు కర్రతో విజయకుమార్‌పై దాడి చేయడంతో అతని తలకు గాయమవగా స్థానికంగా ఉన్న పీఎంపీ వైద్యునితో చికిత్స చేయించారు. అనంతరం తన ఇంటికి అబ్బులు వెళ్లిపోయాడు. రాత్రివేళ విజయకుమార్, సమీప బంధువులైన గంధం శాంతమ్మ, ముప్పిడి వెంకటలక్ష్మి, వేమగిరి వరలక్ష్మి, కొమ్ముకూరి బేబమ్మ, గంధం సుబ్బమ్మ కర్రలు, గునపాలతో అబ్బులుపై దాడి చేసి తీవ్రంగా గాయపరచడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. ఘటనా స్థలికి చేరుకున్న జగ్గంపేట సీఐ బి.సూర్యఅప్పారావు, గండేపల్లి ఎస్సై వై.గణేష్‌కుమార్, సిబ్బంది శవ పంచనామా నిర్వహించారు. వివరాలు సేకరించి మృతదేహాన్ని పెద్దాపురం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఇందుకు కారణమైన వారిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్టు పేర్కొన్నారు.

భార్య, కుమార్తెలు కన్నీరుమున్నీరు

మృతునికి భార్య కృపావతి, కుమార్తెలు మోర్త ఆశమ్మ, ముప్పిడి వెంకటలక్ష్మి, కందుకూరి దుర్గభవాని, దొండపాటి నాగమణి ఉన్నారు. మృతుని నాలుగో కుమార్తె నాగమణి డెలివరీ నిమిత్తం పది రోజులుగా కుటుంబ సభ్యులంతా కాకినాడ ప్రభుత్వ ఆస్పత్రిలో ఉంటున్నారు. మృతుడు అబ్బులు ఒక్కడే ఇంట్లో ఉండటంతో ఒంటరిని చేసి ఈ దారుణానికి పాల్పడ్డారని కుటుంబ సభ్యులు కన్నీరుమున్నీరుగా విలపించారు. ఘర్షణ పడ్డ ఇద్దరూ బంధువులేనని, ఆ సమయంలో అబ్బులు, విజయకుమార్ మద్యం సేవించి ఉండవచ్చని అనుమానం వ్యక్తం చేశారు.



రక్తం మడుగులో ఉన్న మృతదేహాన్ని చూసి ఆందోళనతో చుట్టుపక్కలవారు, బంధువులు



రోదిస్తున్న మృతుని భార్య, కుమార్తెలు, బంధువులు



వివరాలు నమోదు చేసుకుంటున్న సీఐ, ఎస్సై, సిబ్బంది

అంతరిక్ష వారోత్సవాలకు అంతా సిద్ధం



విలేకరులతో మాట్లాడుతున్న శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్ విజయకుమార్

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ప్రపంచ అంతరిక్ష వారోత్సవాలు రాజమహేంద్రవరంలో గురువారం నుంచి ఈ నెల 8వ తేదీ వరకు నిర్వహిస్తున్నట్లు శ్రీహరికోట షార్ ఎల్ఎస్ఎస్ఎఫ్ జనరల్ మేనేజర్ ఎస్.విజయకుమార్ చెప్పారు. మున్సిపల్ కార్పొరేషన్, ప్రైవేట్ కాలేజెస్ అసోసియేషన్, ప్రైవేట్ స్కూల్స్ అసోసియేషన్, ది రాజమండ్రి ప్రెస్ క్లబ్ సంయుక్త సహకారంతో ఈ వేడుకలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించిన ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. ఆయన బుధవారం స్థానిక ప్రెస్ క్లబ్‌లో విలేకరులతో మాట్లాడారు. ఏటా ఏదో ఒక అంశానికి ప్రాధాన్యమిస్తూ అంతరిక్ష వారోత్సవాలు నిర్వహిస్తుండగా ఈ ఏడాది 'స్పేస్ అండ్ ఎంటర్‌ప్రెన్యూర్ షిప్' పేరుతో ప్రైవేటు భాగస్వామ్యాన్ని ప్రోత్సహించే ఉద్దేశంతో వారోత్సవాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఆంధ్రప్రదేశ్‌లో రాజమహేంద్రవరంతో పాటు విశాఖ, కర్నూల్, శ్రీహరికోటలో వారోత్సవాలు చేస్తున్నామని చెప్పారు. తమిళనాడులోని విల్లుపురం, కోయంబత్తూరు, తంబళ్లపల్లి, ఒడిశాలోని పూరీలలో వారోత్సవాలు చేస్తున్నట్లు చెప్పారు. మిగిలినచోట్ల అన్ని సౌకర్యాలున్న ఇంజినీరింగ్ కాలేజీలలో చేస్తుంటే రాజమహేంద్రవరంలో మాత్రం ప్రజల మధ్య చేస్తున్నట్లు ఆయన చెబుతూ అందుకే ఇస్రో దృష్టి ఇక్కడే కేంద్రీకృతమయిందన్నారు. ఇప్పటికే క్విజ్ పోటీలు కూడా జిల్లాలోని 19 మండలాల్లో నిర్వహించారని, డ్రాయింగ్ పోటీలు జరిగాయని, ఇందులో విజేతలకు 8వ తేదీన బహుమతులు ఇవ్వనున్నట్లు తెలిపారు. 6వ తేదీన కళాకేంద్రం ఆవరణలో ఇస్రో పరికరాలు, రాకెట్స్ నమూనాల ప్రదర్శన ప్రారంభిస్తామని, వీటి గురించి వివరించడానికి వీలుగా ఇప్పటికే 60 మంది విద్యార్థులకు శిక్షణ ఇచ్చినట్లు చెప్పారు. అదే రోజు కళాకేంద్రంలో 10/20 స్క్రీన్‌పై ప్రదర్శనలు ఇచ్చి, స్లాట్ వారీగా 8,9,10 విద్యార్థులకు క్విజ్ పోటీలు నిర్వహిస్తామని తెలిపారు. రాజమహేంద్రవరం విద్యాసంస్థల చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి మాట్లాడుతూ గురువారం ఉదయం 9.30 గంటలకు నందం గనిరాజు జంక్షన్ నుంచి కంబాల చెరువు, దేవీచౌక్ మీదుగా శ్రీ వెంకటేశ్వర ఆనం కళాకేంద్రం వరకు వేలాదిమంది విద్యార్థులతో స్పేస్ వాక్ ఉంటుందని తెలిపారు.

వృద్ధురాలి దారుణ హత్య

- నిద్రిస్తుండగా ఘాతుకానికి పాల్పడిన దుండగులు
- కణుపూరులో కలకలం
- పోలీసుల ముమ్మర దర్యాప్తు



పార్వతి మృతదేహం

మధురపూడి: కోరుకొండ మండలం కణుపూరులో తల్లోజు పార్వతి (75) దారుణ హత్యకు గురైంది. తన ఇంట్లో మంగళవారం రాత్రి నిద్రించిన ఆమె బుధవారం ఉదయానికి రక్తపు మడుగులో పడి ఉంది. కోరుకొండ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ జి.ఉమామహేశ్వరరావు తెలిపిన వివరాల ప్రకారం.. కణుపూరు మెయిన్ రోడ్డు బ్రహ్మలవీధిలో పార్వతి నివాసం ఉంటోంది. ఎప్పటిలాగే మంగళవారం రాత్రి తన మూడో కుమారుడు వెంకటేశ్వర్లు ఇంట్లో టీవీ సీరియల్ చూసింది. అనంతరం నాలుగో కుమారుడు వీరబాబు ఉంటున్న తన ఇంటికి వచ్చి నిద్రించింది. బుధవారం తెల్లవారేసరికి చనిపోయింది. స్థానికుల సమాచారం మేరకు పోలీసులు ఘటనా స్థలానికి వచ్చి పరిశీలించారు. గుర్తు తెలియని వ్యక్తులు హత్యచేసి ఉంటారని భావిస్తున్నారు. డాగ్ స్క్వాడ్, క్లూజ్ బృందాలు వచ్చి ప్రాథమిక ఆధారాలను సేకరించాయి. రక్తపు మరకలు ఉన్న నైటీని ఆ ఇంటి లోపల షెడ్‌లో గుర్తించాయి.

బలమైన కర్రతో కొట్టి..

పోలీసు డాగ్ తొలుత ఇంటి నుంచి బయటకు వచ్చి మెయిన్ రోడ్డు మీదుగా సమీప ఇంటి వైపునకు పరుగులు తీసింది. తర్వాత మృతురాలి ఇంటి ఆవరణలోని షెడ్డులోకి వెళ్లింది. అనంతరం రోడ్డు మీదకు వచ్చింది. అలాగే క్లూజ్ టీమ్ ఘటనా స్థలంలో వేలిముద్రలు, మృతిరాలి తలపైనున్న మరకలను పరిశీలించింది. తలపై బలమైన కర్ర లేదా రాడ్డుతో కొట్టి చంపిఉంటారని అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో పలువురు అనుమానితులను విచారణ చేస్తున్నారు. తల్లోజు పార్వతికి తొమ్మిది మంది సంతానం. వారిలో ఐదుగురు కూతుర్లు, నలుగురు కుమారులున్నారు. కుమార్తెలకు పెళ్లిళ్లు కావడంతో వేరే గ్రామాల్లో ఉంటున్నారు. కుమారుల్లో చిన్నవాడితో పాటు ఉమ్మడి ఇంట్లో పార్వతి నివసిస్తోంది. ఆమె భర్త సుబ్బారావు గతంలోనే మృతి చెందాడు.



ఇంటి పరిసరాలను పరిశీలిస్తున్న పోలీసు డాగ్



ఘటనా స్థలాన్ని పరిశీలిస్తున్న ఎస్సై కట్టా శారదా సతీష్

డబ్బుల కోసం తగవు పడి ఆత్మహత్య

ముమ్మిడివరం: భార్యాభర్తలు తగవు పడగా, భర్త మనస్తాపానికి గురై ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ముమ్మిడివరం మండలం అన్నంపల్లి గ్రామానికి చెందిన గుత్తుల వెంకట రమణ(31), భార్య దివ్యశ్రీ ఉపాధి నిమిత్తం హైదరాబాద్ వెళ్లి అక్కడ పనులు లేక నాలుగు నెలల క్రితం తిరిగి వచ్చేశారు. గత నెల 29న భార్యాభర్తలు డబ్బుల కోసం తగువు పడ్డారు. దీంతో మనస్థాపానికి గురైన వెంకట రమణ ఫ్యాన్‌కు ఉరి వేసుకోగా భార్య గమనించి అతన్ని ముమ్మిడివరం తరలించగా అక్కడ నుంచి మెరుగైన వైద్యం కోసం కాకినాడ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఈ మేరకు ముమ్మిడివరం స్టేషన్ ఎస్‌హెచ్‌ఓ జి.బైరవ స్వామి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గుండెపోటుతో మున్సిపల్ ఉద్యోగి మృతి

యానాం: మున్సిపల్ శానిటరీ వర్కర్ పాలెపు ఆనంద్‌కుమార్ వర్మ(46) బుధవారం గుండెపోటుతో మృతి చెందారు. కురసాంపేటలోని తన ఇంట్లో గుండెపోటు రావడంతో ప్రభుత్వాసుపత్రికి తరలించగా మృతి చెందినట్లు వైద్యులు ధ్రువీకరించారు.

దసరా మహోత్సవాలకు రాట ముహూర్తం



రాట ముహూర్తంలో పాల్గొన్న ఈవో, పండితులు, గ్రామ పెద్దలు

రామచంద్రపురం రూరల్: ద్రాక్షారామ మాణిక్యాంబా సమేత భీమేశ్వరస్వామి ఆలయంలో దసరా మహోత్సవాలకు బుధవారం రాట ముహూర్తం చేశారు. ఈఓ పితాని తారకేశ్వరరావు ఆధ్వర్యంలో వేద పండితులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు. అష్టాదశ శక్తి పీఠాల్లో 12వ శక్తి పీఠంగా వెలగొందుతున్న మాణిక్యాంబా అమ్మవారికి ఈ ఏడాది దసరా తొమ్మిది రోజులు ఆలయ చరిత్రలో తొలిసారిగా అవతారాల్లో అలంకరించడానికి ప్రత్యేక ఏర్పాట్లు చేసినట్టు ఈఓ పితాని తారకేశ్వరరావు తెలిపారు. 15న బాలాత్రిపుర సుందరీదేవి, 16న గాయత్రీ దేవి, 17న అన్నపూర్ణా దేవి, 18న మహాలక్ష్మి, 19న మహాచండీ , 20న సరస్వతీ, 21న లలితా త్రిపుర సుందరి, 22న దుర్గాదేవి, 23న మధ్యాహ్నం 12 గంటల వరకు మహిషాసురమర్దని, మధ్యాహ్నం 3 గంటల నుంచి రాజరాజేశ్వరి దేవిగా అమ్మవారిని అలంకరిస్తారని చెప్పారు.